గమనిక:ఫోటోలు మీ-ఇమెయిల్ ఐడిలో గలవు

పత్రికా ప్రకటన తేదీ. 15.07.17

రాష్ట్రంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో పద్మభూషణ్ డా॥ కె.ఎల్.రావు పాత్ర ఎంతో ఉందని అలాంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్ని పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు.

శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో డా॥కె.ఎల్.రావు 115 వ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ కొద్దిమంది చరిత్ర సృష్టించడానికే వస్తారని అలాంటి కొద్దిమంది వ్యక్తులలో కెఎల్‌రావు ఒకరని చరిత్ర ఉన్నంతవరకు ఇలాంటి వ్యక్తులను మరిచిపోదని చెప్పారు. మానవుల మనుగడకు నీరు చాలా ముఖ్యమని ఒకప్పుడు నీరు సంవృద్ధిగా ఉండేదని వర్షాలు విపరీతంగా కురిసేవని సంవత్సరంలో 5,6 నెలలు నీళ్లలోనే నడిసేవారమని చెప్పారు. నేడు కృష్ణా నదిలో నీటి సమస్య ఉందని గోదావరి నది అటవీ ప్రాంతం గుండా పయనించడం వల్ల అడవిలో కురిసిన వర్షాలు నదిలోకి వస్తున్నాయని ఆ నీరు వృథాగా సముద్రంలోకి పోతుందన్నారు. అలా సముద్రం లోకి వృథాగా వెళ్లేనీరు 100 నుంచి 200 టిఎంసీల వరకు ఉంటుందన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా డెల్టాని ఆదుకోవడానికి పవిత్ర సంగమం వద్ద గోదావరి నీటిని కృష్ణా నదిలోకి కలుపడం జరిగిందన్నారు. గోదావరి పుష్కరాల సందర్భంగా ఒక మహాసంకల్పం తీసుకుని గోదారమ్మ తల్లి ఆశీర్వాదంతో కృష్ణాకి గోదావరి నీటిని సంవత్సరం కాలంలో తీసుకురాగలిగామన్నారు. శ్రీ కృష్ణదేవరాయులు కాలంలో దేశంలో చెట్లు నాటడం , కాలువలు త్రవ్వడం జరిగిందని, కాటమహాశయుని కాలంలో గోదావరి నదిపై ధవలేశ్వరం, కృష్ణా పై ప్రకాశం బ్యారేజీ , పెన్నానది పై ఆనకట్టలు నిర్మించి రాష్ట్రంలో రైతుల పాలిట దేవుడిగా నిలిచారన్నారు. అలాంటి వారిలో కెఎల్‌రావు శివరామకృష్ణ తదితరులు ఉన్నారన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి కెఎల్‌రావు ఆశయాలను నెరవేర్చుతామని ముఖ్యమంత్రి చెప్పారు. 1963 లో అప్పటి కేంద్ర నీటి పారుదల శాఖామంత్రిగా పనిచేసి దేశంలో ప్రాజెక్టులు పూర్తి కావడానికి తనువంతు కృషి చేశారన్నారు. ఈయన కృషి వల్ల నాగార్జునసాగర్ లెఫ్ట్, రైట్ కెనాల్ ను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆనాడు ఈయన చేసిన కృషి వల్లే నేడు రాష్ట్రంలో నీటికి ఇబ్బందులు లేకుండా చేయగలిగామన్నారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిరామారావు బచావత్ అవార్డును స్టడీ చేసి మరొక అవార్డు వచ్చే వరకు పూర్తిగా నీటిని వినియోగించుకునేలాగా చర్యలు తీసుకున్నారన్నారు. రాయలసీమకు నీటిని అందించడానికి శివరామకృష్ణయ్య లాంటి ఇంజనీర్లు విశేషంగా కృషి చేశారన్నారు. చివరి భూములు వరకు నీళ్లు ఇచ్చే పనిని ముఖ్యమంత్రి గా నేనే స్వీకరించి ప్రాజెక్టు పూర్తి చేస్తున్నారన్నారు. 518 మంది కొత్త ఇంజనీర్లకు ఉద్యోగాలు కల్పించి జలవనరుల శాఖను పరిపుష్టం చేస్తున్నామన్నారు. యువ ఇంజనీర్లు అంతా నీటి భద్రతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విభజన ఇబ్బందులు ఎన్ని వున్నా జలవనరుల శాఖకు మాత్రము నిధుల కేటాయింపులో వెనుకడుగు వెయ్యలేదని ఆ శాఖ అధికారులు కూడా కష్టించి పనిచేస్తున్నారని కొనియాడారు. నాకు మొదట్లో జలవనరుల శాఖ కార్యలయమే షెల్టర్ ఇచ్చిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఒక పక్క తుఫాన్‌లు , ఇంకో పక్క రాయలసీమ కరువు ను వెంటాడే పరిస్థితుల నుంచి బయటకు తీసుకురాగలిగామన్నారు. నీటి సంఘాల సలహాదారు చెరుకూరి వీరయ్య 80 సంవత్సరాల వయస్సులో 26 సంవత్సరాల యువకుడుగా పనిచేస్తున్నారని ఆయన కమిట్‌మెంట్ చూస్తే చాలా ఆనందంగా ఉంటుందన్నారు. సాగు నీటి సంఘాలు కాలువ చివరి ఆయుకట్టు భూములకు నీళ్లు వెళ్లేలాగా చూడాలని రైతులకు సకాలంలో నీళ్లు ఇచ్చే బాధ్యత తీసుకోవాలని వర్షాలకు చెరువులు నిండి తెగే ప్రమాదం ఉందని వాటిని గమనించి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

రాష్ట్రంలో 2 కోట్ల ఎకరాల భూమి ఉందని ఇప్పటికి కోటి నాలుగు లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నామని ఇంకా 95 లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. 26 లక్షల ఎకరాల భూములకు నీటి వసతి అదనగంగా ఇవ్వచ్చన్నారు. ఈ పొలాలకు, ఇండస్ట్రీలకు, త్రాగునీటి అవసరాలకు నీరు ఇవ్వాలంటే ఏ గ్రామాల్లో పడే వర్షాన్ని ఆగ్రామాల్లోనే భూగర్భజలాలుగా మార్చాలని అందుకే నీరు ప్రగతి చేపట్టామన్నారు. ప్రతి సోమవారం పోలవరంగా మార్చామని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ఇది కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 28 ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీటి సౌకర్యాన్ని మెరుగుపరిచి రాష్ట్రాన్ని కరువు రహితంగా చేస్తామన్నారు. ఉత్తరాంధ్రలో వంశధార, తోటపల్లి, పురుషోత్తమ పట్టణం ఎత్తిపోతల ప్రాజెక్టుల వల్ల నీటి లభ్యతను పెంచుతామన్నారు. రాయలసీమలో ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేస్తామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా మడకశిల వరకు నీళ్లు తీసుకువెళ్తామని గొల్లపల్లి, చెర్లపల్లి పూర్తి చేసి చిత్తూరుకు నీళ్లు ఇస్తామన్నారు. కృష్ణా ,పశ్చిమ గోదావరి జిల్లాలో మెట్ట ప్రాంతాలకు నీళ్లు ఇవ్వడానికి చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామన్నారు. డా॥కెఎల్‌రావు జన్మదిన వేడుకలను ఒక స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళతామని చెప్పారు.

స్వర్గీమ మాజీ ముఖ్యమంత్ర ఎన్‌టిరామారావు ,కెఎల్‌రావు, కాటన్ ,శివరామకృష్ణయ్య, శ్రీకృష్ణదేవరాయులు లాంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని నీటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అది మన బాధ్యత అని చెప్పారు. అనంతపురంలో పంటలను కాపాడుకునేందుకు రెయిన్‌గన్స్ వాడామని మొబైల్ లిఫ్ట్ ద్వారా నీళ్లు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. రాబోయే కాలంలో భూమినే జలాశయంగా మార్చుకునే అవకాశాలు చూస్తున్నామన్నారు. ఏ రైతు కళ్లలో కష్టం చూడకూడదన్న ఆలోచనతో కష్టపడి పనిచేస్తున్నామని అందుకు ప్రజలందరు తగిన సహకారం కోరారు. అనంతరం ముఖ్యమంత్రి సభకు హాజరయిన అందరి చేత నీటి సంరక్షణ పై ప్రతిజ్ఞ చేయించారు. కృష్ణా,గుంటూరు జిల్లాలకు చెందిన రైతులు ముఖ్యమంత్రి ని గజమాలతో సత్కరించారు.

డా॥కెఎల్‌రావు 115 వ జయంతి ఉత్సవాల కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు ,కామినేని శ్రీనివాస్, ఎమ్ఎల్‌సిలు బుద్దావెంకన్న, బచ్చుల అర్జునుడు, ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, జలవనరుల శాఖ ఎక్స్‌ఫర్ట్ కమిటి సభ్యులు చెరకూరి వీరయ్య, ఇయన్‌సిలు వెంకటేశ్వరరావు , రవికుమార్, ఎపెక్స్ కమిటి సభ్యులు ఆళ్లగోపాలకృష్ణ, గుత్తా శివరామకృష్ణ , పుల్లయ్య చౌదరి , ఇంజనీరింగ్ విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

..........................................................................................................

సహాయ సంచాలకులు , రాష్ట్ర సమాచార కేంద్రం విజయవాడ వారిచే జారీ చేయడమైనది.